# వీక్నెస్

చేసుకుంటే ఇతన్నే చేసుకోవా లనుకుంది నందిని. అలా అనుకున్న కాస్సేపటికే బాబోయ్ ఇతన్నెలా చేసుకోవాలి? అని భయపడి పోయింది. ఆ భయం కాస్త తగ్గాక ఇంతకన్నా ఎవరు కావాలి? ఇతన్నే చేసుకుంటే సరి! అనుకుంది. వసంతరావునే చేసుకుంటా నంది. చేసుకుంది.

పెళ్ళిచూపుల్లో నందినిని ముప్పు తిప్పలు పెట్టిం దల్లా వసంతరావు చెప్పిన మూడే మూడు ముక్కలు. అమ్మాయితో ఏకాంతంగా మాట్లాడాలి అన్నాక ఆమెతో చెప్పాడు ఆ మాటలు.

"చూడండి. నాకు అందమైన ఆడవాళ్ళంటే చాలా వీక్నెస్. అమ్మాయి ఒప్పుకుని అవకాశం దొరికితే సరదాగా గడిపేస్తాను. పెళ్ళి తర్వాత అయినా మారను. అలా మారడం నాకు ఇష్టం ఉండదు. తర్వాత నా గురించి తెలిసి నిష్ఠూరం చేస్తే లాభం ఉండదు. ముందే చెప్పేస్తున్నాను. ఇష్టం లేకుంటే పెళ్ళికి ఒప్పుకో కండి" అన్నాడు.

సూటిగా వచ్చిన ఆ మాటల ఘాటుకి తల తిరిగి పోయింది నందినికి. కాస్సేపటి లోనే అతని నిజాయితీకి ముగ్ధురా లైంది.

పెద్దలతో ఈ సంగతి గురించి చర్చించి రభస చేసుకోవడం ఇష్టం లేక పోయింది.

అతను బోలెడంత ఆస్తిపరుడు. దిక్కు తెలీ నంత బిజినెస్.

అందితే తాళి కట్టించుకునే అమ్మాయిలు ఎందరో ఉన్నారు. ఎవర్నీ మెచ్చక చివరికి తనని చూసి ఒప్పుకున్నాడు.

దర్జాగా రాజులా ఉన్నాడు. ఉరక లేసే వయసు. ఫ్యాక్టరీలు, కార్లు, నౌకర్లు, సిబ్బంది, నాలుగు రాష్ట్రాల్లో ఆఫీసులు...క్షణం తీరిక ఉండ దతనికి.

మరి ఈ అందమైన అమ్మాయిల పిచ్చి?

తమాషాకి అతనితో వాదనకు దిగుతున్నట్టుగా "పెళ్ళయిన తర్వాత

మీరు మార రని అంత నిశ్చయ మేమిటి?" అని అడిగింది నందిని.

అతను సీరియస్‌గా చూసిన ఆ చూపు చాలా అందంగా ఉందని పించింది. ఇటువంటి చూపులకి అమ్మాయిల మనసు కెలికిన ట్లవుతుంది.

"నాన్సెన్స్! భార్య కోసం నా పద్ధతు లేవీ మార్చుకో నవసరం లేదు. పురుషాహంకారం లాంటి మాటలకు నేను విలువ ఇవ్వను. ఆడ శరీరం వేరు. మగ శరీరం వేరు. వాటి అవసరాలూ వేరు. అనుభవాలూ వేరు...ఓ.కె. మీకు అభ్యంతరం అయితే ఒప్పుకోవద్దు లెండి..." అన్నాడు వసంతరావు.

ఒక్క తృటిలో జీవితాలు ఎంత ఎడమై పోవచ్చు?

నందినికి మేధావులతో, బాగా చదువుకున్న వారితో మాట్లాడ్డం అంటే చాలా సరదాగా ఉంటుంది.

"ఒక్క మాట...నా మాట అని కాదు...మీలాగే మీ భార్య కూడా...పూర్తి స్వేచ్ఛను... అంటే...సంబంధాల విషయంలో మీరు కోరేంత పూర్తి స్వేచ్ఛను...కోరుకుంటే?..." అని నిర్మొహమాటంగా అడిగింది.

అత నేమాత్రం తడబడ లేదు. "నా భార్య వేరే మగాళ్ళతో తిరిగితే ఒప్పుకోను" అన్నాడు ఖచ్చితంగా.

"మరి...అన్యాయం కాదా?"

"కాదు. నాది యుగ యుగాల మగవాడి దృష్టే! నా భార్య నా స్వంతం. అక్కడే ఉంది నా నైజం. ఇతరుల భార్యల్ని నేను కోరుకోను. నా కోసం ఎగబడి వస్తే నేను కా దనలేను నా భార్య ఇంకొకరి కోసం అలమటిస్తుం దంటే నేను ఊహించలేను. ఎందుకంటే నేను స్త్రీలని అంత గొప్పగా ప్రేమిస్తాను."

"మీరు కోరుకున్నట్టే సరదా కోసం మీ భార్య కూడా వేరే అనుభవాలు కోరుకో వచ్చు కదా?"

"కోరుకోదు...ఎందు కంటే అది స్త్రీ నైజం కాదు. నేను ఈ అమ్మాయిని అనుభవించాను అని మగవాడు అనుకుంటాడు. నేను ఈ మగవాడి చేత అనుభవించ బడ్డాను అనే అమ్మాయి అనుకుంటుంది తప్ప...నేను ఇతన్ని అనుభవించాను అనుకోదు...సారీ మీకు ఇవన్నీ తెలియవు...." అన్నాడు వసంతరావు.

సిగ్గుపడింది నందిని.

అతని దగ్గర చాలా నేర్చుకో వచ్చు. నేర్పుతాడు.

అంత నిజాయితీ ఉంది.

అందుకే ఒప్పుకుంది.

అతను మామూలు మగవాడు కాదు. తను సగటు స్త్రీయే అయినా అతనితో జీవితం పంచుకుంటే ఎంతో థ్రిల్ ఉంటుంది. అనే అనుకుంది.

హనీమూన్ రోజులు వెన్నెల విహారాలు సన్న జాజులు గులాబీలు పోటీపడి పరిమళాలతో ముడేసిన రాత్రులు, నందినికి జీవితాంతం గుర్తుండే మధురానుభూతులవి.

వసంతరావు నిజంగా వసంత పురుషుడే.

ఆడవాళ్ళంటే అతనికి మోజు ఎందుకు ఉంటుందో అర్థమై పోయింది.

అతని మాటలు, చూపులు, ముద్దులు, కౌగిలింతలు, యౌవనాన్ని అదుపు చేసే శక్తి, ఏకాంతంలో అతను చూపే సహనం...

అలిసినప్పుడు సేద దీరే పద్ధతి, సెక్స్ మాటలు, సిగ్గుని అర్థం చేసుకోవడం, ఆడ శరీరం అవసరాన్ని క్షణాల్లో గుర్తించడం... అన్నీ అద్భుతంగా అలరించాయి ఆమెను.

కొత్త కాపురంలో ఆమె తబ్బిబ్బు అవుతుండగా అతను వ్యాపార ప్రపంచంలోకి దూసు కెళ్ళి పోయి తోచినప్పుడు ఫోన్‌లో పలకరిస్తూ హఠాత్తుగా సినిమాకో ఏ పార్టీకో తీసుకెళ్ళి ఎంజాయ్ చేసేవాడు.

పెళ్ళి చూపులప్పుడే అంత నిర్మొహమాటంగా నిజం చెప్పేశాడు కదా ఎప్పుడేం ఉపద్రవం తెస్తాడో అని ఆమె భయపడింది గాని వసంతరావు మళ్ళీ అటువంటి ప్రస్తావన తీసుకు రాలేదు.

డైనింగ్ టేబుల్ దగ్గర ఆమె నర్మ గర్భంగా అమ్మాయిల గురించి ఏదో అనే సరికి అతను తినడం కూడా ఆపేసి తీవ్రంగా కోప్పడ్డాడు.

"నిజం చెప్పేశానని నన్ను ఒక ఫూల్ లాగా చూడొద్దు. నువ్వు తెలుసుకో నవసరం లేని నా పర్సనల్ విషయాలుంటే అవి నీకు చెప్పను. నువ్వు తెలుసుకునే అవకాశం కలిగించను...అయితే ఒకటి మాత్రం ష్యూర్! నా భార్యకు మరెవ్వరూ ఎట్టి పరిస్థితిలోనూ పోటీ ఉండరు! అది అసంభవం!" అన్నాడు.

వసంతరావుకు కోపం రాకూడదు. వస్తే ఎదిరించడం కష్టం. సారీ చెప్పేస్తే మాత్రం నవ్వేస్తాడు. మళ్ళీ మనసులో ఉంచుకోడు. అది అతని గొప్పతనం.

సారీ చెప్పేసింది. నవ్వేశాడు.

ఆ తర్వాత చాలా సార్లు అతని పర్సనల్ విషయాల గురించి ఆలోచించ బోయి ఎటూ తేల్చుకో లేక ఊరుకుంది నందిని. అనవసరంగా అతని మీద

డిటెక్టివ్ పని చెయ్యబోవడం బొత్తిగా ఇష్టం లేదు.

అత నన్నట్టు నిజం చెప్పాడు కదా అని అతన్ని ఫూల్ లాగా చూడ్డం ఘోరం.

అతను చెప్పకుంటేనేం?

ఎప్పటికైనా తనకు ఎటువంటిది తెలిసినా అతను ఎన్ని రకాలుగా బుకాయించ కూడదు?

ఆఫీసులు, ఫ్యాక్టరీల మధ్య తిరుగుతూనే ఉంటాడు. మూడు కార్లున్నాయి. డ్రైవర్లు, సెక్రెటరీలు కనుసన్నల్లో మెదుల్తూ ఉంటారు.

ఆఫీసుల్లో ఆడ సిబ్బంది బోల్డు ఉన్నారు. ఉద్యోగాల కోసం ఎందరో వస్తుంటారు. బిజినెస్ ప్రపంచం. డబ్బు చుట్టూ పరుగు.

పార్టీ లుంటాయి. సెమినార్‌లు ఉంటాయి. క్యాంప్‌లు ఉంటాయి.

అతను ఏ ఊరికి ఎప్పుడు ఫ్లైట్ ఎక్కుతాడో తెలియదు. ఊళ్ళోనే ఉన్నా ఇంటికి ఎప్పుడు వస్తాడో తెలియదు. ఒక్కో సారి సాయంత్రం నాలుగు గంటలకే ఇంటికి వచ్చేస్తాడు. ఒక్కోసారి తెల్లవారు జామున మూడుకు గానీ రాడు. అత నెక్కడున్నా భోజనం, టిఫిన్ కారులో వెళ్తాయి.

ఎలా అతన్ని పట్టుకోవడం?

సిటీలో నెంబర్ వన్ బిజినెస్ మాన్! అతని చుట్టూ ఎప్పుడూ మనుషులు.

ఎన్నెన్నో రకాలుగా ఊహించు కుంది నందిని. మెల్ల మెల్లగా అర్థమైంది. ఇంత బిజీ లైఫ్‌లో అతను గోప్యంగా పర్సనల్ లైఫ్ ఎలా గడప గలడు?

మనసుంటే మార్గా లుంటాయి.

హెూట ళ్ళున్నాయి. అపార్ట్‌మెం ట్లున్నాయి. గెస్ట్ హౌస్‌లు ఉన్నాయి. మీటింగ్ ఉందని ఆఫీస్‌లో అదృశ్యమైతే మళ్ళీ అతను వచ్చే దాకా మీటింగ్‌లో ఉన్నట్టే! కాదనే దెవరు ?

నిప్పు లేనిదే పొగరాదు. కాని పొగ రానివ్వకుండా నిప్పు రాజెయ్య వచ్చు.

నిప్పూ పొగా తెలీకున్నా పచ్చగా ఉన్నవాళ్ళ మీద నలుగురి కళ్ళూ ఉంటాయి. అలాగే కాలక్షేపంగా వాగే నాలుకలూ ఉంటాయి.

ఒకానొక ఆత్మీయ మిత్రురాలు ఒక సాయంత్రం నందినిని పరామర్శించ డానికి వచ్చి "ఎందుకైనా మంచిది...నువ్వు జాగ్రత్తగా ఉండాలి... మీ వారు అందగాడు...బోల్డంత ఆస్తి, పవరు...ఎగరేసుకు పోవా లనుకునే ఆడపిల్లలు

చాలా మంది ఉంటారు" అని హితవు చెప్ప బోయింది.

"ప్లీజ్!...అటువంటి మాటలు నాతో అనొద్దు...ఆయన ఎటువంటి వారో నాకు బాగా తెలుసు..." అని ఆ ప్రస్తావన తుంచేసింది నందిని.

అంత ధీమాగా ఆ మాట చెప్ప గలిగి నందుకు గర్వంగా ఫీలయ్యింది. పెళ్ళి చూపు లప్పుడే వసంత రావు తన కంతా చెప్పెయ్యడం ఎంత గొప్ప పనో అప్పుడు ఇంకా బాగా అర్థ మైంది.

అర్థ మైతే ఎంతో హాయి.

వసంతరావు తత్వానికి సంబంధించి అపార్థాలకు ఆస్కారమే లేదు. ఇంట్లో అతను గడిపినంత కాలం నవ వసంతం వచ్చినట్టే. జోక్ మీద జోక్ పేలుస్తాడు. తృప్తిగా తింటాడు. చక్కగా డ్రెస్ చేసుకుంటాడు. ఆమెకు మంచి ప్రెజంటేషన్స్ తెస్తాడు.

ఆమె కట్టూ బొట్టు కళ్ళారా చూసుకుని మెచ్చుకుంటాడు. "నువ్వు నా అదృష్టానివి! రియలీ గ్రేట్!" అంటాడు. అది పొగడ్తలా ఉండదు.

ఒకసారి బెడ్‌రూం లో కాస్త అనుమానంగానే అడిగింది. "బైట మీరు ఎలాగెలాగో గడుపుతారేమో...ఆ జబ్బుల గురించి చదివినా విన్నా భయమేస్తుంది. ఎయిడ్స్ లాంటి వ్యాధులు..."

అంటుండగానే అతను మాట కట్ చేశాడు. "ష్! నేనంత పశువుని కాను...ఆ జాగ్రత్తలు ఎప్పుడూ ఉంటాయి. డోంట్ వర్రీ!.." అని దాటవేశాడు.

గొప్పవ్యక్తి. గొప్ప బాస్. గొప్ప మేనేజర్. భార్యను కూడా మేనేజ్ చేస్తున్నాడు.

మ్యారేజ్‌ను కూడా మేనేజ్ చేస్తున్నాడు.

తన మీదకు ఎప్పుడూ నింద రాకుండా చూసుకుంటున్నాడు. అంత తెలివైన వాడు, అందగాడు, మంచి వాడికి భార్య కావడం అదృష్టమే!

కాని కాపురం కాస్త పాత బడుతుండగా ఈ అదృష్టంలో ఏదో అపశృతి ధ్వనించింది. మెల్ల మెల్లగా ప్రారంభమై వికారంగా ఉద్ధృతంగా చెలరేగు తోంది ఒక్క అనుమానం. ఇటువంటి భర్త కోసం తను గానీ అనవసరంగా రాజీ పడిపోయిందా?

అతను లేనప్పుడల్లా ఈ అనుమానం నందినిని పిశాచంలా బాధించ సాగింది.

ఆఫీస్‌కే వెళ్ళాడో, ఫ్యాక్టరీ లోనే వున్నాడో, క్యాంప్ నుంచే ఫోన్ చేశాడో

సిటీలోనే ఎక్కడైనా ఉన్నాడో, ఏ అందగత్తె కౌగిట్లోనో వెచ్చ వెచ్చగా కరుగుతూ హాయిగా నవ్వే స్తున్నాడేమో.

"డార్లింగ్! మీ ఆవిడకి ఏమని చెబుతావు?" అని అడిగే వగలాడి కల్లా...

"నో ప్రాబ్లెం...! అది పక్కా సంసారి! పతివ్రత! పెళ్ళికి ముందే మనమంతా చెప్పేశాం! మనమేం చేసుకున్నా అడ్డే లేదు!" అని జోక్ చేస్తూ పగలబడి నవ్వుకుం టున్నా డేమో!

పైకి మాత్రం అవగాహన, చక్కగా అర్థం చేసుకునే భార్య అంటున్నా...లోప ల్లోపల దీనికి మనకంటే మంచి వా డెవడు దొరుకుతాడు ఇంత స్టేటస్ ఎలా వస్తుంది? చెప్పినట్టు పడుండక ఏం చేస్తుంది? అనుకుం టున్నా డేమో!

తలుచుకున్న కొద్దీ ఆమెలో అసహనం పెరిగింది. సరిగ్గా అదే సమయంలో బిజినెస్ పనుల వత్తిడి వల్ల అతనికి ఇంటి ధ్యాస తగ్గింది.

కొత్త ఫ్యాక్టరీ పని ముగింపునకు వస్తున్న దశలో రాత్రిం బవళ్లూ పని చేయ వలసి వస్తోంది.

ఇంటి మొహం ఎప్పుడో చూస్తున్నాడు. వెళ్ళిపో తున్నాడు. ఎక్కణ్ణించో ఫోన్ కాల్. 'సారీ డార్లింగ్...రావడం లేదు...నువ్వు వెయిట్ చెయ్యకు...' అదీ శుభవార్త!

తనకు అంత స్వేచ్ఛ అవసరంలేదు. కానీ అస్తిత్వమైనా అవసరం లేదా? తిని పడుకోవ డానికేనా ఈ శరీరం? అతని కోసం ఎదురు చూసి నిస్పృహతో నిట్టూర్చడాని కేనా జీవితం?

ఎప్పుడో అతనికి అన్ని పనులూ కుదిరి అతనికి తీరికై నప్పుడు వచ్చి వెళ్ళడానికేనా ఇల్లూ ఇల్లాలూ? మధ్య మధ్యలో ఈ అనుమానపు రంధి...గుట్టు చప్పుడు కాకుండా ఏ అందాల విందుల్లో మునిగి వుంటాడో...అని! ఏకాంతపు రాత్రిళ్ళు ఆమె విసుగంతా వికృతంగా గడ్డ కట్టింది.

ఒక సారి అది విశ్వరూపం దాల్చింది. ఎలాగూ అంటే రెండు రోజుల క్యాంప్ అంటూ వెళ్ళినవాడు అతను మూడో రోజు మధ్యాహ్నానికి ఫోన్ చేసి చెప్పాడు ఆ రోజూ రావడం లేదని.

ఏదో సెటిల్ కాలేదు. ఎవరో దొరకడం లేదు.

అతను మామూలుగా చెప్పినా ఆ మాటలు ఆమెకు కర్ణ కఠోరంగా

వినిపించాయి.

అతను చెప్పిందంతా అబద్ధ మైనా తను చెయ్య గలిగింది లేదు. పతివ్రత కాబట్టి ఓపిగ్గా వెయిట్ చేస్తూ కూచోవాలి అతని కోసం. అంతే! అంతేనా?

అంతే కానవసరం లేదనుకుంటూ వెంటనే సూట్‌కేస్ సర్దుకుని పుట్టింటికి వెళ్ళి పోయింది నందిని.

గంటన్నర ప్రయాణం.

డ్రాప్ చేశాక కార్ డ్రైవర్‌ని వెళ్ళి పొమ్మంది.

అయ్యగా రడిగితే ఏమీ చెప్ప నవసరం లేదంది.

తల్లీ తండ్రీ ఇంట్లో వాళ్ళందరూ ఎన్ని రకాలుగా గుచ్చి గుచ్చి అడిగినా ఏమీ చెప్పలేదు నందిని.

చెప్ప దలచ లేదు. కాస్త ఛేంజ్ కోసం వచ్చా నంటూ అందరి కుశలం కనుక్కుంటూ కుర్రాళ్ళతో సరదాగా కాలక్షేపం చేస్తూ గడిపేసింది.

మరుసటి రోజు సాయంత్రానికి సుడిగాలి లా వచ్చి పడ్డాడు వసంతరావు. వివరమేమీ తెలియలేదు కాబట్టి ఆమెకు ఒంట్లో ఏమైనా జబ్బు చేసిం దేమో నని కలవర పడి పోయాడు.

అతన్ని చూడగానే ఆమెలో ఆవేశం పూర్తిగా కట్టలు తెంచుకుంది. ఎన్నో రోజులుగా ఎవ్వరికీ తెలియకుండా అణచి పెట్టిన ఆవేశం అది.

తనకు అతను తప్ప వేరే ప్రపంచమే లేదు. అతని ప్రపంచంలో ఎందరో ఉన్నారు. ఉంటారు. తను కేవలం ఒక నలుసు మాత్రమే.

"అయితే బోరెత్తి వచ్చావా? సో...సారీ...ఎప్పుడూ ఇలా చెయ్యలేదు నువ్వు..." అని అతను అనునయిస్తుండగా ఆమె ముందూ వెనుకా చూడకుండా ఒక్కసారిగా విరుచుకు పడింది.

"అంతా ఎప్పుడో చెప్పారు కదా! నా కెందుకు బోర్ కొడుతుంది? మీ కెన్నో పనులు. క్యాంప్‌లు. ఫ్యాక్టరీలు. మీటింగ్‌లు...గెస్ట్‌లు..."

నందిని గొంతు పెంచడం చూసి ఇంట్లో వాళ్ళందరూ అదిరి పడ్డారు. ఇరుగు పొరుగు వాళ్ళు కూడా గోడలకు చెవులు పెట్టారు.

"సో సారీ నందినీ... మనం ఇంటి కెళ్ళి మాట్లాడు కుందాం రా..." అని అతను అంటున్నా వినిపించు కోకుండా అక్కసు నంతా కక్కేసింది.

అయితే అసలు విషయ మేమిటో బైట పడనివ్వ కుండా మాటలు నొక్కు కుంది.

ఆమె ఎన్ని మాట్లాడినా నోరెత్తకుండా విన్నాడు వసంతరావు. "సారీ...మనింటికి పోదాం...రా!" అనే అడిగాడు పదేపదే.

ఏదో గిల్లి కజ్జా అనుకుంటూ ఇంట్లో వాళ్ళు కూడా సర్ది చెప్పే సరికి అతన్తో బాటు బయలు దేరక తప్ప లేదు. కార్లో కూచున్నాక ఆమె కంట నీరు ఆగ లేదు.

ఇంటి కొచ్చే సరికి బాగా పొద్దు పోయింది.

వంట వాళ్లని, నౌకర్లని దగ్గర చేర నివ్వ కుండా పంపేశాడు వసంతరావు.

ఈజీగా లుంగీ లోకి మారి పోయి చకచకా ఇంటి పనులు చేయడం మొదలెట్టాడు.

"అలిసి పోయాం గాని ఇప్పుడు భోజనాలేం వద్దు. సింపుల్‌గా కానిద్దాం" అంటూ వంటింట్లోకి దూరి ఆమ్లెట్లు చేశాడు. ఆమెను పొయ్యి దగ్గరికి రానివ్వలేదు. ఉల్లిపాయలు మాత్రం తరగ నిచ్చాడు.

బ్రెడ్ టోస్ట్ చేశాడు.

ఫ్రిజ్ లోంచి పళ్ళు తీసి వాటిని శుభ్రంగా కడిగి నీటుగా ముక్కలు ముక్కలుగా కట్ చేసి పింగాణీ ప్లేట్లలో అమర్చాడు.

క్యాంప్ నుంచి పట్టు కొచ్చిన స్వీట్స్, కేక్, సాస్, వేడిపాలు...ఇంకేం కావాలి?

అతను ఏవేవో చెప్తూ తన నోటికి అందిస్తుంటే అవన్నీ ఆరగిస్తున్న నందినికి ఒక్కసారిగా ఇల్లే ఇంద్ర భవనంలా అనిపించింది.

అదే అతనిలో మ్యాజిక్.

వాతావరణాన్నే మార్చేస్తాడు. అతనున్న చోటల్లా చైతన్యం, ఉత్సాహం, సరదాల పందిరే!

ఈ సరదాలన్నీ ఎవరికి పడితే వాళ్ళకి గోప్యంగా పంచేస్తుంటా డనే కినుక...కాని అతనికేం పట్టింది?

బాల్కనీలో రిలాక్స్ అవుతూ ఆమె వంక కొత్తగా చూస్తూ "స్నానం చేద్దామా...?" అన్నాడు.

అతని ఆహారం, నిద్ర, స్నానం అలవాట్లు అన్నీ వింతగా ఉంటాయి. "స్నానం చేద్దామా?" అనే మాటతో ఆమె మనసు ఒక్క సారిగా పెళ్ళయిన తొలి రోజు ల్లోకి గెంతింది.

చేద్దామా అంటే కలిసి అని కదూ అర్థం? ఆ కొంటె తనం, పసి పిల్లాడి

మనస్తత్వం ఒకరి శరీరాన్ని ఒకరు ఇష్టంగా చూసుకోవడం... అన్నీ గుర్తొచ్చాయి.

ఇప్పుడు వద్దన్నా వినలే దతను.

"కోపా లుంటే తర్వాత లే..." అంటూ చనువుగా లాక్కు పోయాడు. హాట్ షవర్. కోల్డ్ షవర్. రెండూ కల గలిసిన వింత జల్లులు.

ఊపిరిలో ఆవిరి సుడి తిరుగు తుండగా ఆమెను పూర్తిగా తడిపేస్తూ తను తడిశాక నిదానంగా ప్రీతిగా గోముగా అన్నీ లాగేశాడు.

ఎంత ముద్దు? అది నటనే అయితే అంత సహజంగా ఉంటుందా? అంత సహజంగా అనిపిస్తే అది నటన అయితేనేం?

ఆమె మోకాళ్ళలో సన్నటి వణుకు....

అతనిలో తనకు తెలీని దేమీ లేదు.

ఉన్నా, తెలుసుకో కుంటేనే సుఖమేమో?

హనీమూన్ రోజుల్లో అతని అల్లరి ఇంకా ఏ మాత్రం పాతబడ లేదు. బెడ్రూం ఉందని గుర్తే లేనట్టు ఏదో అడవిలో జలపాతం కింద ఉన్నట్టు సకల ప్రపంచం తగుల బడి పోయినా ఫరవా లే దన్నట్టు ఒక్క క్షణం ఆగితే సుఖం చెదిరి పోతుం దన్నట్టు అక్కడి కక్కడే షవర్ కిందే...నిలుచునే...

సుఖ దుఃఖాల్లా కురుస్తున్న షవర్ కిందే ఇద్దరూ మంచు ముద్దల్లా కరుగుతూ అక్కడే కూలబడి కుప్పలా పడిపోయారు...నిట్టూర్పులకి ఆవిరి చెదిరి బాత్రూం అంతా కమ్మింది.

నిండుగా తృప్తిగా ఉన్నా నందిని మనసులో ఉన్న తెరలు మాత్రం తొలగడం లేదు.

తెల్లవారు జామున అతను ఆద మరచి నిద్ర పోతుండగా కిటికీ కవతల కుంగి పోతున్న చంద్రుడి కేసి చూస్తూ దిగులు పడి పోయింది.

అలకలు తీరిన ఈ అనుభూతి ఎప్పుడో గానీ దక్కదు. అతనిలో అన్నీ ఉన్నాయి. ఎన్నో ఉన్నాయి. తను కేవలం ఒక ఆడది...అంతేనా?

అతని జుత్తులోకి చేతి వేళ్ళు పోనిచ్చి కెలుకుతూ మేలుకొల్పా లని ప్రయత్నించింది. నిద్ర చెదిరినా అతను కళ్ళు తెరవ లేదు.

"నందూ ప్లీజ్...నిద్రొస్తోంది" అంటున్నాడు తృప్తిగా నవ్వు కుంటూ.

అతని ఛాతీ మీద వెంట్రుకల్ని మెలి పెడుతూ అలాగే తల వాల్చి గుండె శబ్దం వింది.

కపటం తెలీని చప్పు డది. ఆ చప్పుడు కేవలం తనకే కావాలంటే

కుదరదా?

"నందూ...డోంట్‌డిస్టర్బ్...డార్లింగ్...రెస్ట్ లేదు ...ప్లీజ్ ... లేపొద్దు ...ఊఁహూఁ..." గొణుగుతున్నాడే గాని కళ్ళు తెరవడం లేదు.

ఒకే ఒక్క విషయం అడిగి తెలుసు కోవాలని తేల్చు కోవాలని ఆమెకు తహతహగా ఉంది. ఇంత కన్నా మంచి సమయం ఉండ దన్నట్టు అతని చెవి దగ్గర పెదవులు కదిలిస్తూ అడిగింది...

"మరి...ఈ మాత్రం దానికి...ఇంత దూరం రావాలా? నిద్ర పోవ డానికి? ఎన్ని చోట్ల...ఎన్ని రకాలుగా నిద్ర పోకూడదూ? మీకేం....కావా లనుకుంటే....ఎన్ని రుచులో కదా?"

"నందూ....డోంట్ బీ సిల్లీ..." కుర్రాడిలా ఆమె ఒళ్ళో తల పెట్టుకుని ముడుచుకు పడుకున్నాడు.

"ఇందుకేనా ఇల్లూ ఇల్లాలూ?..."

"ఆహాఁ..." కళ్ళు తెరవ కుండా నిద్రలో పలవరి స్తున్నట్టే చెప్పాడు... "ఆఁ... ఇంకెందుకూ మరి? నందూ డార్లింగ్! మగవాడి మన సెల్లాంటిదో నీకు సరిగ్గా తెలీదు. ఎక్క డెక్కడో గడిపి నప్పుడు... గిల్టీగా ఉంటుంది. వెంటనే గది నుంచి బైట పడదా మనిపి స్తుంది. కళ్ళూ మనసూ చెదిరిన తర్వాత ఆ అందం వల్ల సుఖం కావా లనిపి స్తుంది...సుఖం దక్కిన తర్వాత మాత్రం...వెంటనే పారిపోవా లనిపి స్తుంది."

"రియలీ?...ఎక్కడికి?..."

"ఇంటికి! ఎన్నో చోట్ల సుఖా లుంటాయి గాని...సుఖంతో బాటు శాంతి....సుఖం కన్నా ఎక్కువ శాంతి దొరికేది...ఇంట్లోనే.... నీతోనే..."

వింటూనే అతని మీదకు వాలి పోయింది నందిని.

మరి ఆ సుఖాల కోసం ఆరాట మెందుకు? అనే మాట గొంతు లోనే అణిగి పోయింది. వీక్నెస్ అని అతను ఎప్పుడో చెప్పాక ఇంకా అడిగే దేముంది? నిజం చెప్పేసిన కుర్రాడిలా నిర్మలంగా నవ్వుకుంటున్న అతని పెదవుల మీద ముద్దు పెట్టుకుంది నందిని, అతని శాంతి చెదర నంత సున్నితంగా !

బలహీనతలు తెలిసీ మనిషిని ప్రేమించడం ఎంత అదృష్టం!!

27.02.1998 సంచిక